క్లుప్తంగా

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదానం చేస్తున్న విద్యార్థులతో చైర్మన్ సత్యనారాయణ తదితరులు

గోపాలపట్నం: నరవలోని విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ డే సందర్భంగా మంగళవారం నిర్వహించిన రక్తదా న శిబిరాన్ని కళాశాల చైర్మన్ జి సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ సేవా పథకం దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం చేయడం ఎంతో మంచి విషయమన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీ ప్రదీప్‌వర్మ మాట్లాడుతూ రక్తదానం అంటే మరొకరి ప్రాణాలను కాపాడడమేనన్నారు. శిబిరంలో సుమారు 100 యూనిట్లు రక్తాన్ని సేకరించామని తెలిపారు. అమ్మ బ్లడ్ బ్యాంక్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ చిట్టిమిరెడ్డి వీరునాయుడు, కళాశాల బోర్డు డైరెక్టర్ బోను భాస్కరరావు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న మమత

విశాఖవిద్య: అనాథ శవానికి బుచ్చిరాజు పాలెం జీవీఎంసీ షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఫుట్ పాత్ మీద మతి స్థిమితం లేక తిరుగుతున్న ఓ వ్యక్తిని రెండునెలల కిందట బుచ్చి రాజు పాలెం జీవీఎంసీ షెల్టర్‌కు తీసుకొచ్చి ఆశ్రయం కల్పించారు. అతని మానసిక పరిస్థితి బాగోకపోవడంతో ఆస్పత్రిలో వైద్యం చేయించారు. అయితే అతని ఆరోగ్యం క్షీణించడంతో ఈ నెల 22న కేజీహెచ్‌లో మృతి చెందాడు. మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు కుటుంబ సభ్యులు ఎవరు లేకపోవడంతో, విషయం తెలుసుకున్న ఎల్లేటి మమత ఎయిర్ పోర్ట్ పోలీసుల సాయంతో జ్ఞానాపురం శ్మశాన వాటిలో అంత్యక్రియలు నిర్వహించారు.

28న లడ్డూ వేలం

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు నక్కవాని పాలెం మైదానంలో లంబోధర చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బెల్లం వినాయకుడి వద్ద గల లడ్డూను ఈ నెల 28న వేలం వేయనున్నారు. ఆరోజు సాయంత్రం 5 గంటల నుంచి వేలం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

పార్కింగ్ స్థలం లేక ఇక్కట్లు



కొత్త హెచ్‌పీ పెట్రోల్ బంక్ నుంచి యారాడ పార్కుకు వెళ్లే సేవా మార్గంపై నిలిపిన ద్విచక్ర వాహనాలు



శ్రీహరిపురం నుంచి హెచ్‌పీసీఎల్ లేబర్ గేటు వరకు గల సేవా మార్గంపై నిలిపిన ద్విచక్ర వాహనాలు

- కార్మికుల వాహనాలకు స్థలం కేటాయించని హెచ్‌పీసీఎల్
- దిక్కులేక సేవా మార్గంలోనే నిలిపివేత
- రక్షణ లేక బైక్‌ల అపహరణ
- కూలి పనులకొచ్చి వాహనాలు పోగొట్టుకుంటున్న వైనం

మల్కాపురం: పొట్ట చేత పట్టుకుని ఉపాధి కోసం నగరానికి వస్తున్న కార్మికుల బైక్‌లకు రక్షణ లేకుండా పోతోంది. పని చేయించుకుంటున్న సంస్థ యాజమాన్యమేమో కనీసం పార్కింగ్ స్థలం కూడా కేటాయించడం లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో సేవా మార్గాల్లో వాహనాలు నిలిపి విధులకు వెళ్లిపోతే... పని ముగించుకుని తిరిగొచ్చి చూసే సరికి బైక్‌లు మాయమైపోతున్నాయి. ఇదీ హెచ్‌పీసీఎల్‌లో పనిచేస్తున్న కార్మికులకు ఎదురవుతున్న దుస్థితి. స్థానిక హెచ్‌పీసీఎల్ (విశాఖ రిఫైనరీ) సంస్థలో పలువురు కాంట్రాక్టర్ల వద్ద టెక్నీషియన్స్‌గా, కలాసీలుగా, హెల్పర్లుగా, మెయింటినెన్స్ వర్క్స్ చేసేందుకు పరవాడ, అనకాపల్లి, రాంబిల్లి, గాజువాక, కూర్మన్నపాలెం, డాబాగార్డెన్స్, సీతమ్మధార, మధురవాడ వంటి ప్రాంతాల నుంచి నిత్యం సుమారు రెండు వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు ద్విచక్ర వాహనాలపై వస్తుంటారు. నిజానికి వీరికి సంస్థ యాజమాన్యం పార్కింగ్ స్థలం కేటాయించాల్సి ఉంది. కానీ హెచ్‌పీసీఎల్ అధికారులు పట్టించుకోకపోవడంతో కార్మికులు తమ ద్విచక్ర వాహనాలను సంస్థ ఎదురుగా గల సేవా మార్గాలపై పార్కింగ్ చేసేసి... హడావిడిగా విధులకు వెళ్లిపోతున్నారు. తీరా వారు పని ముగించుకుని ఇంటికి వెళ్దామని సాయంత్రం బయటకు వచ్చేసరికి ద్విచక్ర వాహనాలు అదృశ్యమవడంతో లబోదిబోమంటున్నారు. ఏం చేయాలో తెలియక పోలీసులను ఆశ్రయిస్తున్నారు. గత ఏడాది నుంచి ఇప్పటి వరకు ఈ ప్రాంతంలో ఐదుకు పైగా ద్విచక్ర వాహనాలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారంటే ఇక్కడి పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

మైనర్లే దొంగలు..!

హెచ్‌పీసీఎల్, డాక్‌యార్డు వంటి పరిశ్రమల ముందు పార్కు చేస్తున్న ద్విచక్ర వాహనాలు ఎక్కువగా అపహరణకు గురవుతున్నాయి. గడిచిన 8 నెలల్లో సుమారు ఐదు బైక్‌లను మైనర్లు దొంగలించినట్టు మల్కాపురం క్రైం పోలీసులు గుర్తించారు. వ్యసనాలకు బానిసలైన వీరు డబ్బుల కోసం ఇలాంటి దొంగతనాలు చేస్తున్నట్టు నిర్ధారించారు. దొంగలించిన వాటిలో ఇటీవల కొన్ని రికవరీ చేశామని క్రైం పోలీసులు తెలిపారు. అయినప్పటికీ ఎక్కడా దొంగతనాలు తగ్గడం లేదు. గడిచిన రెండు నెలల్లో ఏఎస్ఆర్ కాలనీ వద్ద ఓ ఆటో, మూడు రోజుల క్రితం ఎంఐజీ కాలనీ వద్ద రెండు లక్షల రూపాయల విలువ చేసే ఓ ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని దొంగలు అపహరించుకుపోయారు. హెచ్‌పీసీఎల్ నుంచి శ్రీహరిపురం, అటు మల్కాపురం వరకు గల సేవా మార్గాలపై ఆధునిక టెక్నాలజీతో కూడిన సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే ద్విచక్ర వాహనాలు దొంగలించిన వారిని సులువుగా గుర్తించవచ్చని పలువురు అంటున్నారు. ఈ విషయంలో క్రైం పోలీసులు తక్షణ చర్యలు తీసుకుంటే మేంచిదని భావిస్తున్నారు.

నిత్యం ట్రాఫిక్ సమస్యలు

హెచ్‌పీసీఎల్ కార్మికులు సేవా మార్గంలో ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో ఉదయం, సాయంత్రం సమయంలో మల్కాపురం, శ్రీహరిపురం కూడలి వద్ద తీవ్ర ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. రోడ్డులో పావు వంతు భాగాన్ని ద్విచక్ర వాహనాలు ఆక్రమిస్తుండడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

పార్కింగ్ స్థలం కేటాయించాలి



హెచ్‌పీసీఎల్‌లోకి పనుల కోసం దూర ప్రాంతాల నుంచి ద్విచక్ర వాహనాలపై వస్తున్న వారికి సంస్థ యాజమాన్యం పార్కింగ్ స్థలం కేటాయించాల్సి ఉంది. కానీ వారు స్థలం కేటాయించకపోవడంతో రోడ్డుపైనే నిలుపుతున్న వాహనాలు అపహరణకు గురవుతున్నాయి. తక్షణమే యాజమాన్యం ఈ సమస్యపై స్పందించాలి.

– పుర్రె అప్పారావు, శ్రీహరిపురం

ట్రాఫిక్ సమస్యలతో ఇబ్బందులు



సేవా మార్గంపై ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో మల్కాపురం, శ్రీహరిపురం, ఆర్ కేపురం, యారాడ పార్కు వంటి కూడళ్ల వద్ద ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. హెచ్‌పీసీఎల్‌లో పనుల కోసం వచ్చిన వారికి పార్కింగ్ స్థలం కేటాయిస్తే ట్రాఫిక్ సమస్య పరిష్కారమవుతుంది.

– నూకరాజు, మల్కాపురం

27న యూనియన్ బ్యాంకు ఉద్యోగుల సమ్మె



సీతమ్మధార యూనియన్ బ్యాంకు ప్రాంతీయ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఉద్యోగులు

సీతమ్మధార : సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 27న యూనియన్ బ్యాంకు ఉద్యోగులు, అధికారుల సంఘం చేపట్టిన సమ్మెను విజయవంతం చేయాలని సంఘం నాయకులు సీతమ్మధారలోని బ్యాంకు ప్రాంతీయ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ యూనియన్ బ్యాంకు ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఉదయ కుమార్ మాట్లాడుతూ బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, ఉద్యోగులపై పని ఒత్తిడి తగ్గించాలని, అప్రెంటిస్ నియామకాలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అధికారుల సంఘం నాయకుడు కె.రమేష్ మాట్లాడుతూ రాత్రి ఏడు గంటలు దాటినా ఇంటికి వెళ్లలేకపోయిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రీజినల్ కార్యదర్శి వసంతరావు, సాగర్, శ్రీనివాస్, ప్రత్యూష, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సత్కారం



61వ వార్డు పరిధి పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం: విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల్లో సేవలు అందించి వచ్చిన 61వ వార్డు పరిధి పారిశుధ్య కార్మికులను ఎమ్మెల్యే పి.గణబాబు మంగళవారం మల్కాపురం వద్ద సత్కరించి, బహుమతులు అందించారు.పారిశుధ్య కార్మికులతో పాటు సచివాలయం ఉద్యోగులకూ బహుమతులు ఇచ్చారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి, వార్డు టీడీపీ అధ్యక్షుడు మజ్జి సోమేష్,కాకి పోలిరెడ్డి,సర్వసిద్ధి శ్రీలక్ష్మియాదవ్, ఉరుకూటి డేవిడ్ పాల్గొన్నారు.

గంజాయి కేసులో పాత ముద్దాయి అరెస్ట్

తాటిచెట్లపాలెం : గంజాయి కేసులో తప్పించుకు తిరుగుతున్న ముద్దాయిని విశాఖపట్నం రైల్వే పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గవర్నమెంట్ రైల్వే పోలీసు ఉన్నతాధికారుల సూచనలతో ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయ నాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ కె.అబ్దుల్ మారూఫ్ సిబ్బందితో కలిసి విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో పాత గంజాయి కేసులో ఏ3గా ఉన్న తూర్పు గోదావరి జిల్లాకు చెందిన రాయుడు యశ్వంత్ విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో గంజాయి రవాణా చేయడానికి రెక్కీ నిర్వహిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనమివ్వాలి



హెచ్‌పీసీఎల్ లేబర్ గేటు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

మల్కాపురం: దేశంలోని ప్రభుత్వ,ప్రైవేట్ పరిశ్రమల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ మల్కాపురం జోన్ నాయకుడు ఆర్.లక్ష్మణమూర్తి డిమాండ్ చేశారు.ఈ సమస్యపై ఈనెల 30న జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద మహాధర్నా చేపట్టనున్నట్టు తెలిపారు. ధర్నాకు సంబంధించి పోస్టర్‌ను సోమవారం హెచ్‌పీసీఎల్ లేబర్ గేటు వద్ద ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం,రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై స్పందించడం లేదని విమర్శించారు. కార్మికులకు పనికి తగ్గ వేతనం రాకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహాధర్నాను కార్మికులంతా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పెంటారావు,పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

మేయర్ దృష్టికి సమస్యలు



మేయర్ హరి వెంకటకుమారికి వినతిపత్రం అందజేస్తున్న 58వ వార్డు కార్పొరేటర్ లావణ్య



మేయర్ హరివెంకట కుమారికి వినతిపత్రం అందిస్తున్న 40వ వార్డు కార్పొరేటర్ నాగేశ్వరరావు

మల్కాపురం: జీవీఎంసీ 58,40వార్డుల్లోని ప్రధాన సమస్యలతో పాటు పలు చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఆయా వార్డుల కార్పొరేటర్లు గులిగిండల లావణ్య, గుండపు నాగేశ్వరరావు వేర్వేరుగా మేయర్ హరివెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌లను కలిసి వినతి పత్రాలు అందజేశారు.58వ వార్డు పరిధిలో ములగాడ గ్రామం నుంచి శ్రావణి షిప్పింగ్ మీదుగా మారుతీ సర్కిల్ వైపు వెళ్లే రోడ్డు వేయాలని కోరారు. పోర్టు అధికారులతో మాట్లాడి ఆ మార్గానికి మోక్షం కల్పించాలన్నారు.అలాగే శ్రీరామ్‌నగర్ గెడ్డ ఆధునికీకరించాలని, పిల్లల పార్కు,పెద్దలకు వాకింగ్ పార్కు వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు.హెచ్‌పీసీఎల్,కోరమాండల్ వంటి పరిశ్రమల నుంచి వస్తున్న కాలుష్యం వల్ల శ్రీహరిపురం,రామ్‌నగర్,పిలకవానిపాలెం,ములగాడ తదితర ప్రాంత వాసులు తీవ్ర ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని..ఆ సమస్యకు పరిష్కారం చూపాలని మేయర్‌తో పాటు జీవీఎంసీ కమిషనర్‌ను కార్పొరేటర్ లావణ్య కోరారు.పోర్టు అధికారులతో మాట్లాడాలని విన్నవించారు.కార్యక్రమంలో గులిగిందల కృష్ణ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు చేయండి

జీవీఎంసీ 40వ వార్డులో అభివృద్ధి పనులు చేయాలని కార్పొరేటర్ నాగేశ్వరరావు కోరారు. యారాడ రోడ్డు నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని, కాకరలోవలో రిటైనింగ్ వాల్ , ఏకేసీకాలనీలో డబుల్‌రోడ్డు నిర్మించాలన్నారు. బీఎస్ఎన్ఎల్ వాల్ పక్క నుంచి మరో చిన్న రోడ్డు నిర్మించాలని కోరారు. వాంబే, టిడ్కో గృహాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని.. తక్షణమే పరిష్కరించాలని కోరారు. అలాగే పలు ప్రధాన సమస్యలు పరిష్కరించాలని పేర్కొన్నారు.

అంధకారం



సింథియా-మల్కాపురం ప్రధాన రహదారిలో టార్చిలైట్ల వెలుగులో ప్రయాణిస్తున్న ప్రజలు



చీకటిమయంగా క్రాంతినగర్ నుంచి మల్కాపురం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే రహదారి

సింథియా: జీవీఎంసీ 63వ వార్డు పరిధిలోని క్రాంతినగర్ నుంచి మల్కాపురం పోలీస్‌స్టేషన్, అటు యారాడ మార్గాల వైపు వెళ్లాలంటే ప్రజలు భయాందోళన చెందుతున్నారు. క్రాంతినగర్‌తో పాటు సింథియా నుంచి మల్కాపురం వరకు ప్రధాన రహదారిలో వీధిలైట్లు వెలగక నిత్యం అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారి మొత్తం చీకటిమయంగా ఉండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరికొందరు టార్చి లైట్ల వెలుగుతో ప్రయాణిస్తున్నారు. కీటకాలు, పాములు సంచరిస్తాయనే భయంతో పాదచారులు చీకటిని అధిగమించే క్రమంలో పరుగులు తీస్తూ గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. పాలకులు మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

బీఐఎస్‌పై విస్తృత ప్రచారం అవసరం

బీచ్‌రోడ్డు : బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్)పై విస్తృత ప్రచారం చేయాలని సీనియర్ డైరెక్టర్ ఎంఏజే వినోద్ తెలిపారు. ప్రపంచ ప్రమాణాల దినోత్సవం సందర్భంగా మంగళవారం నగరంలోని ఒక హోటల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బీఐఎస్ చట్టం 2016 ప్రకారం ప్రామాణీకరణ, నాణ్యత ధ్రువీకరణ కోసం అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలన్నారు.



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



గోపాలపట్నం ఇండోర్ స్టేడియంలో షటిల్ బ్యాడ్మింటన్ ఆడుతున్న విద్యార్థులు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

- రసవత్తరంగా సాగిన క్రీడాపోటీలు
- గోపాలపట్నం హైస్కూల్ గ్రౌండ్‌లో సందడి



హోరాహోరీగా సాగుతున్న వాలీబాల్ పోటీలు



రసవత్తరంగా సాగుతున్న కబడ్డీ పోటీలు

గోపాలపట్నం: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడాపోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. గోపాలపట్నం హైస్కూల్ గ్రౌండ్‌లో మంగళవారం మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. బాలురు బాలికలు విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇక్కడ ప్రతిభ చూపిన వారిని నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. మండల స్థాయిలో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, చెస్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్ బాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు.

నియోజకవర్గం స్థాయి పోటీలు 27, 28న

మండల స్థాయిలో ప్రతిభ చూపిన క్రీడాకారులకు ఈ నెల 27, 28 తేదీల్లో నియోజకవర్గ స్థాయి పోటీలు నిర్వహించనున్నామని పీఈటీలు తెలిపారు.

మద్యం మత్తులో గొడవ

మర్రిపాలెం : మద్యం మత్తులో ఇద్దరు స్నేహితుల మధ్య జరిగిన గొడవలో ఒకరికి గాయాలయ్యాయి. కంచరపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఐటీఐ జంక్షన్ వద్ద నివసిస్తున్న పి.ఉదయ్‌కుమార్, భరణి స్నేహితులు. వీరిద్దరూ ఈ నెల 22న సాయంత్రం బర్మా క్యాంప్ శ్మశాన వాటిక వద్ద మద్యం సేవించారు. ఈ క్రమంలో ఉదయ్ ప్రేమించిన యువతి కోసం భరణి తప్పుగా మాట్లాడడంతో గొడవ ప్రారంభమైంది. అలా మాట్లాడొద్దని ఉదయ్ సముదాయించినా భరణి ఆగకపోగా, తన వద్ద ఉన్న బీర్ బాటిల్‌ను విసిరాడు. తప్పించుకోవడానికి ప్రయత్నించినప్పటికీ ఉదయ్ భుజానికి గాయమైంది. దీంతో మంగళవారం సాయంత్రం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.